కన్వేయన్స్ డ్రైవర్స్ ధర్నా

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 11 : శ్రీరాంపూర్ ఏరియా కన్వేయన్స్ డ్రైవర్స్ సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో డ్రైవర్లు బుధవారం ప్లాకార్డులు పట్టుకొని శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతు కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని 20 రోజులుగా ఆందోళనలు చేస్తు, అధికారులకు వినతి పత్రాలు అందించడం జరిగిందన్నారు. కన్వేయన్స్ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 13 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందన్నారు.

కోలిండియాస్థాయి పోటీల్లో సత్తా చాటాలి

మందమర్రి, సెప్టెంబర్ 11: క్రీడాకారులు కోలిండియా స్థాయి పోటీల్లో ప్రతిభను కనబరచి పథకాలను సాధించి సింగరేణికి మంచి పేరును తీసుకు రావాలని సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జీ.దేవేందర్ అన్నారు. వర్క్ పీపుల్స్ అండ్ గేమ్స్(డబ్ల్యుపీఎస్ అండ్ జీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 60వ వార్షిక క్రీడా పోటీలలో భాగంగా బుధవారం మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల ఆవరణలో గల యోగా హాలులో బెల్లంపల్లి, మందమర్రి ఏరియా స్థాయి బాడీ బిల్డింగ్, వేయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలను జీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, సీఏంవోఏఐ కార్యదర్శి పైడీశ్వర్ పాల్గొన్నారు.

45 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 11 : కాగజ్‌నగర్ పట్టణంతో పాటు వివిధ ప్రాంతాలలోమహారాష్ట్రకు ఆక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న 45 క్విటాళ్ల రేషన్ బియ్యాన్ని కరీంనగర్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం కోసిని గ్రామ సమీపంలో పట్టుకున్నారు. బియ్యాని ఎంఎల్ఎస్ పాయింట్ కు తరలించి, కేసు నమోదు చేసినట్లు సమాచారం.

గ్రామాల సందర్శన

జైపూర్, సెప్టెంబర్ 11 : మండలంలోని మిట్టపల్లి, కాన్కూర్ గ్రామాలను మండల ప్రత్యేకాధికారి జడ్పీ సీఈవో గణపతి బుధవారం సందర్శించారు. గ్రామాల్లోని పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. రోడ్లపైన, మురికి కాలువల్లో నీరు నిలువలేకుండా చూడాలని ఆయా గ్రామాల కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో సీఈవో వెంట ఎంపీడీవో సత్యనారాయణ తదితరులున్నారు.

డీఏలను వెంటనే విడుదల చేయాలి

తాండూర్, సెప్టెంబర్ 11 : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల డీఏలను వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలను సంఘం నాయకులతో కలిసి చక్రపాణి సందర్శించి ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సీపీఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవిదాస్, ప్రధాన కార్యదర్శి సంపత్ పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన జడ్జి

వంటగదిని పరిశీలిస్తున్న జడ్జి ముఖేశ్

కన్నెపల్లి, సెప్టెంబరు 11 : కన్నెపల్లిలోని కస్తూర్బా పాఠశాలలో బుధవారం బెల్లంపల్లి కోర్టు జడ్జి ముకేష్ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం వంట గదిని, కూరగాయలను పరిశీలించారు. వంట గది అపరిశుభ్రంగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. కుళ్లిపోయిన కూరగాయలు ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న నిత్యవసర సరుకులు కనిపించడం లేదని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెను ప్రకారం భోజ నం పెట్టడం లేదని జడ్జికి తెలిపారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలని, తాజా కూరగాయలతో విద్యార్థినీలకు ఆహారం పెట్టాలని సూచించారు. విద్యార్థినీలు పాఠశాలకు ప్రహారీ లేక పోవడంతోనే పాములు వస్తున్నాయని , భయపడుతున్నామని జడ్జికి విన్నవించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కన్నెపల్లి పోలీసులు పాల్గొన్నారు.

న్యాయ నిర్ణేతగా కేసరి అలేఖ్య

రెబ్బెన, సెప్టెంబర్ 11 : ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బిలాయ్‌లో ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే 2024-25 ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ గేమ్స్ 2024 యోగాసన ఈవెంట్‌కు న్యాయ నిర్ణేతగా(టెక్నికల్ అధికారి) కేసరి అలేఖ్య ఎంపిక అయ్యారు. కేసరి అలేఖ్య ను పలువురు అభినందించారు.

నియామకం

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 11 : జాతీయ మాల మహానాడు మంచిర్యాల జిల్లా మంచిర్యాల నియోజక వర్గం ప్రధాన కార్యదర్శిగా శ్రీరాంపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ గుమ్మడి శ్రీనివాస్‌ను నియమిస్తూ బుధవారం జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్ ప్రకటించారు.

స్వచ్ఛత కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్

రెబ్బెన, సెప్టెంబర్ 11: బెల్లంపల్లి ఏరియాలో స్వచ్ఛత కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ స్పష్టం చేశారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో బుధవారం ఏరియాలోని అన్ని విభాగాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొదటి విడతలో ఈనెల 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సన్నాహక కార్యక్రమాలు, అక్టోబర్ 2వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అమలు కార్యక్రమాలు ఉంటాయని వాటిని విజయవంతం చేయాలని కోరారు. ఏరియా ఎస్‌వోటూజీఎం రాజమల్లు, పీవో నరేందర్, ఏరియా ఇంజనీర్ భీంరావుజాడే, డీజీఎం ఉజ్వల్‌కుమార్‌బెహరా, పీఎం రెడ్డిమల్ల తిరుపతి ఉన్నారు.

గని ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 11: శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 5గనిలో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో కేబుల్ బాయ్ నవీన్ చారికి గాయాలు అయ్యాయి. ఎస్‌డీఎల్ యంత్రం కేబుల్ లాగుతుండగా ఎడమ చేయి తట్టుకొని చేయి వేల్లు చితికి పోయాయి. ఏరియా దవాఖానకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 11: మంచిర్యాల రైల్వే స్టేషన్, పెద్దంపేట మార్గ మధ్యలో గుర్తుతెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందినట్లు మంచిర్యాల జీఆర్‌పీ ఎస్ఐ మహేందర్ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు సుమారు 40యేండ్ల లోపు ఉంటాడని, అరెంజ్, నలుపు రంగు గీతల ఫుల్ షర్ట్ బూడిద రంగు పాయంట్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. వివరాలు తెలిస్తే 9701112343, 961868 9679 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన మార్చూరీలో భద్రపరిచినసట్లు పేర్కొన్నారు.

తాండూర్‌లో..

తాండూర్, సెప్టెంబర్ 11 : మండలంలోని రేచిని రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలోరైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి (20) ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ ఈ రాజేశ్వర్ తెలిపారు. ఉదయం 10:45 నిమిషాలకు రేచిని రోడ్ రైల్వే స్టేషన్‌లోని రాజధాని ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు పాలపిట్ట రంగుల షర్ట్, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. రైల్వే పోలీస్ ఎస్ఐ ఉత్తర్వుల మేర కు మంచిర్యాల రైల్వే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వివరాలకు 970111 2343 తెలుపాలని కోరారు.

నవజాత శిశువుకు మెరుగైన వైద్యం

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 11 : జిల్లా కేంద్రంలో గల మాత పిల్లల దవాఖానలో ప్రాణాపాయ స్థితిలో వచ్చిన నవజాత శిశువుకు మెరుగైన వైద్య సేవలు అందించి బాబు ప్రాణాలు కాపాడినట్లు దవాఖాన డాక్టర్ శ్రీశైలం తెలిపారు. బుధవారం దవాఖానలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్దపల్లికి చెందిన కడమంచి తిరుమలకు మూడవ కాన్పులో కరీంనగర్‌లోని ప్రయివేట్ దవాఖానలో ఆగస్టు 26న మగ శిశువుకు జన్మనిచ్చింది. బాబుకు ఊపిరి తీసుకోవడంలో సమస్య తలెత్తడంతో హైద్రాబాద్‌కు వెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. హైదరాబాద్‌కు వెళ్లి ట్రీట్మెంట్ చేయించుకునే పరిస్థితి లేక కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని మాత దవాఖానకు తీసుకవచ్చారన్నారు. బాబును పరీక్షించిన వైద్యుడు శ్రీశైలం బాబు లంగ్స్‌లో సమస్య ఉందని సర్జరీ అవసరం పడుతుందని కుటుంబ సభ్యులకు తెలపడంతో కుటుంబ సభ్యుల కోరిక మేరకు తక్కువ ఖర్చులో బాబుకు లంగ్స్ సర్జరీ నిర్వహించినట్లు తెలిపారు. సర్జరీ అనంతరం 15 రోజులు బాబుని దవాఖానలో అడ్మిట్ చేసుకొని పూర్తిచికిత్స అందించడంతో బాబు సాధారణ స్థితికి వచ్చాడని, పూర్తిగా కోలుకోవడంతో బుధవారం డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ బాబు బ్రతకడమో అన్న బాధలో ఉన్న మా కుటుంబానికి భరోసా ఇచ్చి బాబుకు మెరుగైన వైద్యం అందించిన డాక్టర్ శ్రీశైలంకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డును పరిశీలించిన సబ్ కలెక్టర్

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 11 : కాగజ్‌నగర్ పట్టణంలోని బలగల మైనార్టీ గురుకుల విద్యాలయానికి సంబంధించిన రోడ్డును బుధవారం కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా పరిశీలించారు. మైనార్టీ గురుకుల విద్యాలయానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గురుకుల విద్యాలయం ప్రిన్సిపల్స్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ పరిశీలించారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

మంచిర్యాల (ఏసీసీ), సెప్టెంబర్ 11 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని ఐబీ చౌరస్తాలోని అంబేద్కర విగ్రహం దగ్గర పోరాట సమితి నాయకులు బుధవారం కళ్లకు నల్లని రిబ్బన్ ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుమ్ముల శ్రీనివాస్, శాఖపూరి భీంసేన్, పెండ్లి రాములు, ఆరెందుల రాజేశం, కీర్తి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

డీఈఐఈడీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

ఆసిఫాబాద్ టాన్, సెప్టెంబర్ 11 : జిల్లాలో ఈ నెల 18వ తేదీ నుంచి 2022-24 బ్యాచ్‌తో పాటు గత బ్యాచ్‌లో ఒకసారి ఫెయిల్ అయిన అభ్యర్థులకు డీఈఐఈడీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న పేపర్-1, 19న పేపర్-2, 20న పేపర్-3, 21న పేపర్-4, 23న పేపర్-5, 24న పేపర్-6 నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్ మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

ప్రశంసా పత్రం అందజేత

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్11 : తాము చేస్తున్న వృత్తిలో నిబద్ధత ఉంటే గుర్తింపు లభిస్తుందని స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన ఉపాధ్యాయులను డీఈవో అశోక్‌తో కలిసి శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నిటికన్నా ఉపాధ్యాయ వృత్తి గొప్పదని అలాంటి వృత్తిలో రాణిస్తూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోవడం చాల సంతోషకరమని అన్నారు.

మెడికల్ కాలేజీకి కొండ లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్11 : జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీకి కొండ లక్ష్మణ్ బాపూజీ పేరును కళాశాలకు నామకరణం చేయాలని కోరుతూ బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ బుధవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల సేవలను స్మరించుకునేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. బీసీ యువజన సంఘం నాయకులు సాయి, బాలాజీ, బాపూజీ ఉన్నారు.

వాణిజ్య

మేకిన్ తెలంగాణే లక్ష్యం

ఏఐని అందరికీ అందుబాటులోకి తేవాలి • రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

క్యూసీఎఫ్ఐ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాన్ని ఉత్పాదక రంగంలో అగ్రగామిలా నిలిపేలా 'మేకిన్ తెలంగాణ' భావనను పెంపొందించాల్సిన అవసరం ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పారిశ్రామిక రంగానికి పిలుపునిచ్చారు. దేశీయ మార్కెట్‌లో తెలంగాణ ఉత్పత్తులకు ఆదరణ ఉండేలా నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) హైదరాబాద్ చాప్టర్ 38వ వార్షిక సదస్సును బేగంపేటలోని ఓ హోటల్‌లో ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. పరిమాణంపైనే కాకుండా నాణ్యతకు ప్రాధాన్యతనిస్తే దేశమంతా మనవైపు చూస్తుందన్నారు. ఇక ఉద్యోగుల సృజనాత్మకతను వెలికి తీసి ఆయా రంగాల్లో ఉత్పాదకతను పెంచేందుకు క్వాలిటీ ఫోరం చేస్తున్న కృషిని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. 'క్యాంపస్ టు కార్పొరేట్' అనే మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించడం ప్రశంసనీయమని కొనియాడారు. క్వాలిటీ సర్కిల్ శిక్షణ కార్యక్రమాలకు సహకరించిన ఈసీఐఎల్, ఎన్ఎండీసీ, ఆర్టీసీ, థర్మోపాడ్స్, థర్మోకేబుల్స్, ఉషా ఇంటర్నేషనల్, టాటా గ్రూప్, రేణుకా ప్లాస్టిక్, తోషిబా, రామ్‌కో, కెసీపీ సిమెంట్స్, హెఏఎల్, మిథాని, బీఈఎల్ సంస్థలకు ఈ సందర్భంగా మంత్రి ప్రోత్సాహకాలు అందజేశారు.

కృత్రిమ మేధను ప్రోత్సహిస్తాం

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఏఐ)ను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రోజువారీ కార్యక్రమాల్లోనూ ఏఐ భాగమైపోయిందని, దీనిని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తగిన విధానాలతో ముందుకుపోతోందని చెప్పారు. ఇందులో భాగంగానే విద్యార్థుల భవిష్యత్ అవసరాలు తీర్చేలా స్కిల్డ్ వర్కిటీల ఏర్పాటుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఏఐ వినియోగంపై ఉద్యోగులు, కార్మికులు, పరిశ్రమ ప్రతినిధులకు అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫోరం జాతీయ చైర్మన్ శ్యామ్ మోహన్, హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ బాలకృష్ణరావులు కూడా మాట్లాడారు.

పడేసిన బ్లూచిప్

సెన్సెక్స్ 398, నిఫ్టీ 122 పాయింట్ల పతనం

ముంబై, సెప్టెంబర్ 11: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజు నష్టాలోకి జారుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లు కుప్పకూలడంతో ప్రారంభంలో లాభపడిన సెన్సెక్స్ చివర్లో భారీగా నష్టపోయింది. అటు నిఫ్టీ తన 25 వేల మార్క్ దిగువకు పడిపోయింది. టాటా మోటర్స్, రిలయన్స్, ఎల్ అండ్‌టీ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు నష్టాలవైపు నడిపించాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 398.13 పాయింట్లు కోల్పోయి 81,523.16 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 122.65 పాయింట్లు కోల్పోయి 24,918.45 వద్ద ముగిసింది. 30 షేర్ల ఇండెక్స్‌లో టాటా మోటర్స్ అత్యధికంగా 6 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్, ఎల్‌అండ్‌టీ, ఎస్బీఐ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ కూడా నష్టపోయాయి. కానీ, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యూఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్‌లు మాత్రం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 70 డాలర్ దిగువకు పడిపోయినప్పటికీ ఆసియా మార్కెట్లలో కరెక్షన్ జరిగిందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. చైనా ఆర్థిక వ్యవస్థ మందగిస్తున్నదన్న వార్తలు మార్కెట్ సెంటిమెంట్‌ను నిరాశపరిచిందన్నారు. రంగాలవారీగా ఆయిల్ అండ్ గ్యాస్ 2.25 శాతం, మెటల్ 1.35 శాతం, యుటిలిటీ 1.29 శాతం, ఆటో 1.17 శాతం, కమోడిటీస్ 1.14 శాతం, టెలికం రంగ షేర్లు కుదేలయ్యాయి.

2 రోజుల్లో 1,000 అప్

మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: బంగారం మళ్లీ ప్రియమవుతున్నది. ప్రస్తుత పండుగ సీజన్‌కావడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీంతో గడిచిన రెండు రోజుల్లో పుత్తడి ధర రూ.1,000 ఎగబాకింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం ధర మరో రూ.500 పెరిగి రూ.74,600 పలికింది. అంతకుముందు ఈ ధర రూ.74,100గా ఉన్నది. బంగారంతోపాటు వెండి కూడా పరుగులు పెట్టింది. పారిశ్రామికవర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ ఉండటంతో కిలో వెండి రూ.500 అధికమై రూ.85 వేలకు చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లో 22 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.380 అధికమై రూ.67,150కి చేరుకోగా, 24 క్యారెట్ ధర రూ.410 ఎగబాకి రూ.73,250కి చేరుకున్నది. అలాగే కిలో వెండి రూ.500 ఎగబాకి రూ.91,500 పలికింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ ధర 2,550.90 డాలర్లు పలుకగా, వెండి 29.11 డాలర్లకు చేరుకున్నది.

మళ్లీ భారత్‌కు ఫోర్డ్?

న్యూఢిల్లీ/చెన్నై, సెప్టెంబర్ 11: భారతీయ మార్కెట్‌కు గుడ్‌బై చెప్పిన అగ్రరాజ్యం ఆటో దిగ్గజం ఫోర్డ్.. త్వరలోనే రీఎంట్రీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా పర్యటనలో ఉన్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్.. ఆ సంస్థ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ రాష్ట్రంతో మూడు దశాబ్దాలుగా ఉన్న అనుబంధాన్ని కొనసాగించాలని, చెన్నైలోని ప్లాంట్‌ను తిరిగి తెరవాలని స్టాలిన్ కోరారు. ఈ మేరకు తమిళనాడు సీఎం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. దీంతో ఫోర్డ్ పునరాగమనంపై తిరిగి అంచనాలు ఏర్పడుతున్నాయి. కాగా, 2021లో భారతీయ మార్కెట్ నుంచి ఫోర్డ్ వైదొలగిన విషయం తెలిసిందే. భారీ నష్టాలతోనే కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నది. అంతేగాక చెన్నైలోని తమ ప్లాంట్‌నూ జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌నకు అమ్మాలనుకున్నది. అయితే గత ఏడాది డిసెంబర్‌లో ఈ ప్రణాళికల నుంచి వెనక్కి తగ్గింది. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో కొత్త ప్రణాళికలకు శ్రీకారం కూడా చుట్టింది. అయితే మళ్లీ పెద్దగా కదలికలేవీ లేకపోవడంతో ఫోర్డ్ రాక సందిగ్ధంలో పడింది. కానీ స్టాలిన్ అభ్యర్థనకు ఫోర్డ్ నుంచి సానుకూల స్పందనే వచ్చినట్టు తెలుస్తున్నది. దీంతో ఫోర్డ్‌పై మళ్లీ ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. ఇదిలావుంటే చెన్నై ప్లాంట్‌లో హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ)ను తయారు చేసేందుకు ఫోర్డ్ ఆసక్తితో ఉన్నట్టు సమాచారం. 1990లో ఫోర్డ్.. భారతీయ మార్కెట్‌లోకి ప్రవేశించింది. 2019లో మహీంద్రా అండ్ మహీంద్రాతో జట్టు కట్టినా కలిసిరాలేదు. కరోనా పరిస్థితులు నడుమ పూర్తిగా దేశీయ మార్కెట్‌కు దూరమైంది.

సింగిల్ చార్జింగ్‌తో 331 కిలోమీటర్లు.. ధర రూ.9.99 లక్షలు

ఎంజీ మోటర్ సరికొత్త ఈవీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: ఎంజీ మోటర్.. దేశీయ మార్కెట్లోకి మరో ఈవీని పరిచయం చేసింది. మూడు రకాల్లో లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.9.99 లక్షలు. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. 38 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ కలిగిన ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 331 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 15.6 ఇంచుల టచ్‌స్క్రీన్, 8.8 ఇంచుల డిజిటల్ డ్రైవర్ డిస్ప్లే, వైర్‌లెస్ ఫోన్ చార్జింగ్, ఆటోమేటిక్ ఏసీ, ఆరు ఎయిర్‌బ్యాగ్, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ స్టేబిలిటీ కంట్రోల్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది. 3.3 కిలోవాట్ల ఏసీ చార్జర్ 13.8 గంటల్లో బ్యాటరీ చార్జింగ్ కానుండగా, 7.4 కిలోవాట్ల బ్యాటరీ 6.5 గంటల్లో, 50 కిలోవాట్ల డీసీ ఫాస్ట్ చార్జర్ కేవలం 55 నిమిషాల్లో పూర్తిగా రీచార్జికానున్నది. టాటా నెక్సాన్, మహీంద్రా ఎక్స్‌యూవీ 400, టాటా పంచ్‌లకు పోటీగా ఈ మాడల్‌ను ప్రవేశపెట్టింది.

డిసెంబర్ 11 నుంచి 'భౌమా కొనెక్స్‌పో'

హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ): అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్‌తో కలిసి 'మెస్సె ముంచన్ ఇండియా' సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 11 నుంచి 14 వరకు గ్రేటర్ నోయిడాలో 'భౌమా కొనెక్స్‌పో ఇండియా' జరుగుతున్నది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో మంత్రితో ఈ కమిటీ భేటీ అయ్యింది. ఈ ఎక్స్‌పోలో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన వెయ్యికి పైగా సంస్థలు పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయి. ఈ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించనున్నారు. నిర్మాణ రంగ పరికరాలు ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్నారు.

అలోపెక్స్‌తో భారత్ బయోటెక్ జట్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 11: యాంటీ-మైక్రోబయాల్ వ్యాక్సిన్ ఏవీ0328 కోసం అలోపెక్స్ కంపెనీతో భారత్ బయోటెక్ జట్టు కట్టింది. భారత్‌తోపాటు ఇతర అల్పాదాయ, దిగువ మధ్యశ్రేణి ఆదాయ దేశాల్లో ఏవీ0328 అమ్మకాలు జరుగనున్నాయని సంస్థలు తెలిపాయి. 'అలోపెక్స్ సంస్థ సహకారంతో అవసరం ఉన్న దేశాల్లో ఏవీ0328 వ్యాక్సిన్‌ను తీసుకొస్తుండటం మాకు గర్వంగా ఉన్నది. వ్యాక్సినేషన్ ద్వారా యాంటీ-మైక్రోబయాల్ రెసిస్టెన్స్‌ను తగ్గించే మార్గాలను అందుబాటులోకి తేవడమే మా లక్ష్యం. సురక్షిత, నాణ్యమైన వ్యాక్సిన్లను అందుబాటు ధరల్లో తీసుకురావడానికే మా ఈ భాగస్వామ్యం' అని హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న ప్రముఖ ఔషధ రంగ సంస్థ భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా అన్నారు.

30 కోట్ల నీరవ్ ఆస్తులు జప్తు

పీఎన్‌బీ కేసులో తాజాగా అటాచ్ చేసిన ఈడీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: నీరవ్ మోదీకి చెందిన మరో రూ.29.75 కోట్ల విలువైన ఆస్తుల్ని జప్తు చే